# మిలిటరీ వాడు

"మీనా !" గుమ్మంలో నుండి పిలిచింది అనుపమ.

వంట గదిలో బిజీగా వున్న మీనాకి ఆ పిలుపు వినపడలేదు.

హాల్లో కూర్చుని పేపర్ చూస్తున్న సుధీర్ పేపర్‌తో బైటకు వచ్చాడు.

ఆరు అడుగుల ఎత్తు, కండలు తిరిగిన ఒళ్ళు. పాల మీగడలాంటి శరీర ఛాయ.

నవ మన్మధుడిలా వున్న అతన్ని చూస్తూ అనుపమ కళ్ళు వాల్చేసింది.

"ఎవరు కావాలండీ?"

సన్నజాజి మొగ్గలా వున్న అనుపమను ఆరాధనగా చూస్తూ అడుగుతున్నాడు.

అతని స్వరం విని మీనా ఇవతలకు వచ్చింది.

"అనూ, నువ్వా రా లోపలకు" అంటూ మీనా అనుపమ చెయ్యి అందుకుంది.

"అనూ ఇతను మా బాబాయి కొడుకు. నాకు తమ్ముడు. ఎయిర్ ఫోర్స్ మెకానిక్‌గా ప్రస్తుతం ఢిల్లీలో పని చేస్తున్నాడు" అంటూ అతన్ని పరిచయం చేసింది.

అతన్ని చూడాలంటే అనుపమకు సిగ్గు అడ్డువచ్చింది.

"అక్కా! మరి ఆమెను నాకు పరిచయం చేయవేం?" చిలిపిగా అడిగాడు.

"ఈమె నా ఫ్రెండ్ అను. ఈ ఊరు వచ్చిన దగ్గర నుంచి ఇద్దరం స్నేహంగా వుంటున్నాం. చాలా!" తమ్ముడ్ని ఓరగా చూస్తూ అంది ముప్పయి ఎనిమిదేళ్ళ మీనా.

"ఐ.సీ. చాలా అందమైన ఫ్రెండే!" సుధీర్ కళ్ళు కుతూహలంగా అనుపమను చూశాయి.

మీనా అది గ్రహించింది. తల కొట్టుకుంది.

"ఈ పెళ్ళికాని అబ్బాయిలతో ఇదే చిక్కు!" అంది.

"మరైతే నాకు పెళ్ళి చేసి పుణ్యం కట్టుకోరాదూ!"

"ముదిరిపోయిన బ్రహ్మచారివి. నాకెందుకు! ఏదో నా ఇంటికి వచ్చావు. నాలుగు రోజులు పెట్టింది తిని అవతలకు వెళ్ళు!" మీనా రుసరుసలాడింది.

అక్కా, తమ్ముళ్ళ సంభాషణ వింటున్న అనుపమ ఇక నవ్వు ఆపుకోలేకపోయింది. గలగలా నవ్వేసింది.

"అక్కా త్వరగా పళ్ళెం తే!" సుధీర్ అరిచాడు.



"ఎందుకురా?" మీనా తెల్లబోయింది.

"మీ ఫ్రెండ్ నవ్వితే ముత్యాలు రాలాయి. ఏరి పళ్ళెంలో వేద్దాం."

అనుపమ బుగ్గలు సిగ్గుతో ఎర్రబడిపోయాయి. ఆ చెక్కిళ్ళు నిమరాలనిపించింది సుధీర్‌కు.

మీనా భర్త టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ట్రాన్స్‌ఫర్ మీద ఈ ఊరు వచ్చి సంవత్సరం దాటుతోంది. పక్క వీధిలో వున్న అనుపమతో మీనాకు పరిచయం అయి ప్రాణస్నేహంగా మారింది.

సుధీర్‌కు ముప్పయి సంవత్సరాలు వచ్చినా ఇంకా పెళ్ళి కాలేదు. నెల రోజులు లీవ్ మీద వచ్చాడు. అక్కను చూసి చాలా కాలం అయిందనుకుంటూ ఇవాళ ఉదయమే మీనా ఇంటికి వచ్చాడు.

మీనాకు ఇద్దరు పిల్లలు.

* * *

ఆ రోజు మీనాతో సుధీర్ అనుపమ ఇంటికి వచ్చాడు. అనుపమ నాన్నగారు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్. అనుపమకు ఇంకా పెళ్ళికాలేదు. ఈ ఏటితో ఆమె చేస్తున్న పి.జి. పూర్తి అవుతుంది.

"నిన్ను చూడాలని మావాడు కలవరిస్తున్నాడు. అందుకే తీసుకువచ్చాను" నిస్సంకోచంగా మీనా చెప్తున్న మాటలకు సుధీర్ చిరుకోపంగా చూస్తే, అనుపమ కళ్ళు నేల మీదకు వాలిపోయాయి.

"తీసుకొచ్చింది చాల్లే. నువ్వెళ్ళి వంట చేసుకో!" సుధీర్ అక్కను కసిరాడు.

"నేను వెళ్ళిపోతే అనూ నీతో మాట్లాడదు" మీనా అంది.

'ఎందుకు మాట్లాడను, ఇంత అందగాడు ఎదురుగా వుంటే!' అనుకుంది మనసులో అనుపమ.

* * *

మీనా కూతురు తెచ్చిన చీటీ చదివింది అనుపమ. "మనం పార్కులో కలుసుకుందాం రండి" అని వుంది. ఆ చీటీ సుధీర్ ఇచ్చాడని, అమ్మతో చెప్పొద్దన్నాడని చెప్పింది మీనా కూతురు చిన్ని.

పార్కులో సుధీర్ కోసం ఎదురు చూడసాగింది అను.

హుందాగా నడిచి వస్తున్న సుధీర్‌ను చూస్తుంటే అను హృదయం వేగంగా కొట్టుకుంది.

సుధీర్ వస్తూనే చనువుగా అను చెయ్యి పట్టుకున్నాడు.

"నేను పిలవగానే వచ్చారంటే మీరు కూడా నన్ను ప్రేమిస్తున్నారన్న మాట!" అన్నాడు.

అను హృదయం లయ తప్పింది.

అతని బలమైన వేళ్ళ మధ్య సున్నితమైన తన చెయ్యి నలిగిపోతున్నా అనుకు హాయిగా వుంది.

"మాట్లాడు అనూ!" మృదువుగా అన్నాడు.

"మీరు మిలటరీవారు. మీకు చెడు అలవాట్లు వుంటే ఎలా?" ఏదో మాట్లాడాలన్నట్టు కంపిస్తున్న స్వరంతో అంది.

సుధీర్ పెద్దగా నవ్వాడు.

"మిలటరీవాడు అయితే మనసు వుండదా! భార్యా, బిడ్డలు కావద్దా! అయినా నేను అలా కనిపిస్తున్నానా! నేను డిఫెన్స్‌లో చేరేటప్పుడు పది హేను సంవత్సరాలు పెళ్ళిచేసుకోనని బాండ్ రాశాను. అది ఈ నెలతో పూర్తి అయిపోయింది. అందుకే నాకు ఇంతకాలం పెళ్ళి కాలేదు" చెప్పాడు.

"నా కోసమే అనుకుంటాను" అస్పష్టంగా అంది.

"అను! నిన్ను ఒక్కసారి గాఢంగా కౌగలించుకుంటాను"

"అమ్మో! ఇక్కడా!" మెల్లగా చూసింది.

అటు ఇటు మనుషులు తిరుగుతున్నారు.

"ఒరేయ్! మిలటరీ వెధవా! పది రోజులు ఓపికపట్టురా! వచ్చే నెలలో మంచి లగ్నాలు వున్నాయి. పెళ్ళి చేసుకుని గాఢంగా కాదు. గాలి కూడా రానంత గట్టిగా కౌగలించుకుందువుగాని" అంటూ

వచ్చిన మీనాను చూసి దొంగల్లా మొహాలు పక్కకు తిప్పుకున్నారు సుధీర్, అనుపమ.

మీనా వేలు పట్టుకుని నిలబడిన చిన్నిని కొరకొరా చూశాడు సుధీర్.

"దుర్మార్గురాలా! పెళ్ళి కాకుండా ప్రేమ అనుభవం తెలుసుకుందాం అనుకున్నాను. పానకంలో పుడకలా వచ్చావు" అక్కను కసురుకున్నాడు.

మీనా, అనుపమ నవ్వుకున్నారు.

చిన్ని పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొట్టింది.

— దేవినేని ఉష



9-6-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక